నాటి ఆదర్శం నేడు కొరవడిందా?

- ఒక్క సమస్యతో వందేళ్ల ఐక్యత చిన్నాభిన్నం
- సమన్వయ లోపం వల్లే ఆందోళనలు
- 21పిట్ ఏరియాలో ప్రకంపనలు సృష్టించిన జేకే ఓసీ


21పిట్ ఏరియా

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థ ఆవిర్భావ తర్వాత మొదటగా ఏర్పడిన కార్మికవాడ. సుమారు వందేళ్లుగా ఐక్యత చాటుకున్న కార్మికుల నివాస సమూహం. పండుగలు, ఆత్మీయ సమ్మేళనాలు, శుభకార్యాలు ఒక్కటిగా జరుపుకున్న గ్రామం. సింగరేణి నుంచి ఎదురైన సవాళ్లనూ సమష్టిగా ఎదుర్కొన్న కాలనీ. బయటి ప్రాంతం నుంచి ముద్దుగా 21 ఏరియాగా పిలవబడుతూ ఘనమైన చరిత్ర కలిగిన ఇక్కడ ఇప్పుడు సింగరేణి ప్రారంభించనున్న జేకే ఓసీ పేరుతో చిన్నాభిన్నమైంది.

అఖిలపక్షంగా ఉద్యమిస్తూ..

మండలంలోని 21పిట్ ఏరియాను విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీలుగా విభజించారు. కానీ 21పిట్ ఏరియాకు ఎదురయ్యే ప్రతీ సమస్యను రెండు పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాలు అఖిలపక్షంగా ఏర్పడి ఐక్యంగా ఎదుర్కొన్నారు. జేకే ఓసీ ఏర్పాటుకు సింగరేణి ముందుకొచ్చిన నాటి నుంచి ప్రతీ అంశంపై స్పందిస్తుండగా... అఖిలపక్షం అంగీకారంతో 21పిట్ ఏరియా పరిధిలోని విజయలక్ష్మీనగర్ పూర్తిగా, తిలక్‌నగర్‌లో పాక్షికంగా సర్వే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

భవిష్యత్‌పై భయంతో..

సింగరేణి సంస్థ ఆవిర్భావ సమయంలో కార్మికులు గుడిసెలు వేసుకొని ఇక్కడే నివాసం ఉండేవారు. ఈ తరువాత సింగరేణి యాజమాన్యం క్వార్టర్లు నిర్మించింది. నాటి క్వార్టర్లు నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంత భూగర్భంలో 20పిట్, 23పిట్, 24 ఇంక్లైన్ పేరుతో గతంలోనే బొగ్గు తవ్వకాలు జరిగాయి. ఫలితంగా పలుమార్లు భూమి కుంగిపోవడం, విషవాయువులు వెలువడటం జరిగాయి. ఇలాంటి పరిస్థితిలో ఓసీ ఏర్పాటు పేరుతో సింగరేణి అధికారులు ఇక్కడ ఇళ్లకు మరమ్మత్తులు చేయనివ్వలేదు. తాజాగా జేకే ఓసీ పేరుతో విజయలక్ష్మీనగర్‌లో పూర్తిగా, తిలక్‌నగర్‌లో కొంత భాగం నిర్వాసిత ప్రాంతంగా ప్రకటించిన సింగరేణి సంస్థ అందుకు అనుగుణంగా సర్వే ప్రారంభించడంతో ప్రజల్లో ఆందోళన ప్రారంభమైంది. పక్కనే ఓసీ ఏర్పడితే బ్లాస్టింగ్ వల్ల ఎటువంటి ఉపద్రవాలు సంభవిస్తాయో.. ఇప్పటికే జేకే-5 ఓసీ ప్రభావిత ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలను చూసిన వారు ఆందోళన చెందుతున్నారు.

అభద్రతతోనే ఆందోళన బాటలో..

జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంగా గుర్తిస్తే తప్ప తమకు న్యాయం జరగదని భావించిన ప్రజలు సమస్యను సింగరేణి అధికారులు, పలు రాజకీయ పక్షాలకు వివరించే ప్రయత్నం చేశారు. కానీ నిర్దేశించిన ఏరియా వరకే నిర్వాసిత ప్రాంతంగా గుర్తిస్తామని అధికారుల నుంచి స్పష్టమైన సంకేతాలు రావడంతో స్థానికుల్లో అభద్రతాభావం అధికమైంది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

సమన్వయ లోపం వల్లే జటిలంగా..

జేకే ఓసీ ఏర్పాటుపై సింగరేణి యాజమాన్యం అఖిల పక్ష కమిటీతో చర్చిస్తూ వచ్చింది. కొన్ని అంశాలపై కమిటీ నుంచి ఎదురైన అభ్యంతరాలను సంస్థ అధికారులు నివృత్తి చేస్తూ వచ్చారు. కానీ అఖిల పక్ష కమిటీగా ఏర్పడిన పెద్దలు సింగరేణి యాజమాన్యంతో ఏం చర్చించారో.. కమిటీగా సంస్థ దృష్టికి తీసుకెళ్లిన అభ్యంతరాలు.. అందుకు సింగరేణి నుంచి వచ్చిన సమాధానాలపై క్షేత్రస్థాయిలో ఎక్కడా చర్చించిన దాఖలాలు లేవు. దీంతో ఎవరికి వారు ఆందోళన చెందుతున్నారు.

ఏరియా పెద్దలు స్పందిస్తేనే..

21ఏరియాలో ఇంతకాలం ప్రజలను సమన్వయం చేస్తూ ఐక్యతకు నిలయంగా తీర్చిదిద్దిన పెద్దలు, అఖిల పక్ష కమిటీ, ప్రజాప్రతినిధులు మరోసారి నాటి స్ఫూర్తిని ప్రదర్శించి తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై స్నేహపూర్వకంగా చర్చించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?



సింగరేణి ఆవిర్భావం నుంచి ఉన్న 21పిట్ ఏరియాలో కార్మికులు, వారి వారసులే నివాసం ఉంటున్నారు. దశాబ్ద కాలంగా ఓసీ పేరుతో ఇళ్లను మరమ్మతులు చేయనీయడం లేదు. ఇప్పుడు పక్కనే ఓసీ ప్రారంభిస్తే నివాస గృహాలు ఉంటాయా.. జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు.

– స్రవంతి, సర్పంచ్, తిలక్‌నగర్

ఎన్నికలు బహిష్కరిస్తాం



21 ఏరియా మొత్తాన్ని జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ఆందోళన చేస్తున్నాం. కానీ తమ ఆవేదనను సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం, రాజకీయ పక్షాలు పట్టించుకోవడం లేదు. ఈ కారణంగా ఎన్నికలు బహిష్కరించాలని నిర్ణయించాం. ఎవరొచ్చినా నిర్ణయం మార్చుకోము.

– సంపత్, కుమ్మరిబస్తీ, 21 ఏరియా

న్యాయం జరిగే వరకు ఉద్యమం



జేకే ఓసీ పేరుతో సింగరేణి యాజమాన్యం ఎటువంటి అభివృద్ధి చేయలేదు. చిన్న గుడిసె కూడా నిర్మించుకోనీయలేదు. ఈ కారణంగా ఇరుకు గదులలో ఉమ్మడి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం తమ పక్కనే ఓసీ తీస్తే మా పరిస్థితి. న్యాయం కోసం ఉద్యమం ఆగదు.

– వాంకుడోత్ విజయ్, భూపేష్‌నగర్, 21ఏరియా

వ్యాపారులకు ఇబ్బందులు రానివ్వొద్దు..


ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్ద వ్యాపారులతో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): పట్టణంలోని రైతుబజార్‌లో రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వ్యాపారులకు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులకు కోరారు. శనివారం సీపీఐ బృందం నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వ్యాపార సముదాయాలను సందర్శించి, వ్యాపారుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు నిర్మాణంలో జరుగుతున్న లోపాలను ప్రతినిధి బృందానికి వివరించారు. కూనంనేని మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ వ్యాపార సముదాయాల నిర్మాణాన్ని తాము స్వాగతిస్తున్నామని అయితే ఈ నిర్మాణాలు వ్యాపారుల అభీష్టం మేరకు జరగాలన్నారు. రాష్ట్రంలో అన్నింటి కంటే భిన్నంగా కొత్తగూడెంలో ప్లాన్ మార్చటం వల్ల ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇందులో కమర్షియల్ వ్యాపారులకు గదులు కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంతోకాలంగా ఇక్కడ వ్యాపారాలు చేసుకునే ప్రతీ వ్యాపారికి సరిపడా గదులు నిర్మించి ఎలాంటి వివాదాలు లేకుండా అప్పగించాలని పూర్తిస్థాయిలో విద్యుత్, నీటి సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, గెద్దాడి నగేష్, నునావత్ గోవిందు, వ్యాపారులు రాము, స్వామి, వెంకటేశ్వర్లు, దేవేందర్, మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను వ్యాధుల నుంచి రక్షించండి...

కొత్తగూడెంరూరల్: ప్రాణాంతక వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్న మైలారం గ్రామప్రజలను రక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వైద్యశాఖ అధికారులను కోరారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామాన్ని కూనంనేని సందర్శించారు. జ్వర బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటి కాలుష్యం, పారిశుద్ధ్య లోపం కారణంగా స్థానికులు కిడ్నీ, కీళ్ల నొప్పులు, విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. తక్షణమే గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, లక్ష్మీపతి, తేజావత్ లాలు, కుంజ రాంబాబు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రక్చర్ ట్రైనింగ్‌ను ప్రారంభించిన జీఎం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏరియా జీఎం జాన్ ఆనంద్ ప్రారంభించారు. శనివారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 12 రోజుల పాటు ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లకు మారుతున్న టెక్నాలజీ మీద అవగాహన కల్పించేందుకు ప్రతీ ఐదేళ్లకోసారి ఈ ట్రైనింగ్‌ను అందిస్తామని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్యం, పని ప్రదేశంలో రక్షణ చర్యలు ఓసీలో బొగ్గు వెలికి తీసేందుకు నూతన పద్ధతులపై కార్మికులకు పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. తప్పక రక్షణ చర్యలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాస్, ఎంవీటీసీ మేనేజర్ మహేష్, సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన


టేకులపల్లి: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు


ఇల్లెందురూరల్: నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 10వ రోజుకు చేరుకుంది. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో మధ్యాహ్న భోజన కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు శంకుతల, కూకట్ల శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం వండి వడ్డించే కార్మికులను నెలకు రూ.వెయ్యి వేతనం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కుమారి, స్వరూప, జయ, నాగలక్ష్మి, నర్సమ్మ, లక్ష్మి, సునిత, దేవి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, జీఓ నంబర్ 8 ప్రకారం వేతనాలు ఏరియర్స్‌తో సహా చెల్లించాలని తదితర డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె పదో రోజుకు చేరింది. శనివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. ఈసం రాణెమ్మ, నాగలక్ష్మి, మంగీ, సింధు, మహేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్పీ అభినందన


మురళీకృష్ణను అభినందిస్తున్న రమణమూర్తి

ఇల్లెందురూరల్: కొమరారం పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఆజ్మీర రతన్‌లాల్ కుమారుడు మురళీకృష్ణ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు మురళీకృష్ణను డీఎస్పీ రమణమూర్తి శనివారం ఘనంగా సన్మానించారు. ఇల్లెందు సీఐ కరుణాకర్, కొమరారం ఎస్సై గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కల రాజశేఖర్‌కు అభినందనలు


వెంకటపుల్లయ్యకు మొక్క అందజేస్తున్న రాజశేఖర్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంకు చెందిన సింగరేణి ఉద్యోగి పర్యావరణ పరిరక్షకుడు, మొక్కల ప్రేమికుడు కొట్టూరి సూర్వి రాజశేఖర్‌ను సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సంగం వెంకటపుల్లయ్య అభినందించారు. శనివారం కొత్తగూడెంలో గ్రీన్ వెహికల్ గార్డెన్ కార్యక్రమంలో భాగంగా రామవరంకు చెందిన రాజశేఖర్ రోడ్డుపై ప్రతి వాహనదారుడికి ఒక మొక్కను అందజేస్తున్నారు. ఇందులో భాగంగా సంగం వెంకటపుల్లయ్యకు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ ఒక మొక్కను నాటాలని ఉద్యమించిన మొక్కల ప్రేమికుడు అభినందనీయుడన్నారు.

కిశోరామృతం ప్యాకెట్లు పంపిణీ


కిశోరామృతం ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణం మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు సన్యాసి బస్తీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో బాలికలకు కిశోరామృతం ప్యాకెట్లు అందజేశారు. శనివారం అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తంగెళ్ల లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్ గుణలక్ష్మి బాలికలకు కిశోరామృతం ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కిశోరామృతంతో యుక్త వయస్సులో ఉన్న బాలికలకు పౌష్టికాహారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా, బాలికలు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ


వాలీబాల్ కిట్లు అందజేస్తున్న పులి సైదులు

ఇల్లెందురూరల్: మండలంలోని పూబెల్లి గ్రామ పంచాయతీ దండగుండాల గ్రామానికి చెందిన యువతకు జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సమకూర్చిన వాలీబాల్ కిట్లను కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పులి సైదులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుకు ప్రాధాన్యమిస్తూ ఖాళీ సమయాల్లో ఆటలు ఆడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోళ్ల సూర్యం, ముక్తి కృష్ణ, సూర్నపాక సత్యనారాయణ, చీమల బక్కయ్య, దొడ్డ నాగేశ్వరరావు, రవి, అశోక్, కోటేష్, రమేష్, సారయ్య పాల్గొన్నారు.

వంటావార్పుతో నిరసన

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ-పంచాయతీ టెక్నికల్ వింగ్ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన శాంతియుత సమ్మెలో భాగంగా శనివారం కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో వంటావార్పుతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కిషోర్, క్రాంతి, కిరణ్‌కుమార్, అరవింద్, చంద్రకళ, అనీషా, రవి పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ రేషన్ దుకాణంలో బతుకమ్మ చీరలను చల్లసముద్రం ఎంపీటీసీ పూనెం లింగమ్మ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళలు ఆదెమ్మ, చక్రమ్మ, కళమ్మ, ఉపేంద్ర, సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి భజరంగ్‌దళ్ శౌర్య జాగరణ యాత్ర

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివారం జరగనున్న భజరంగ్‌దళ్ శౌర్య జాగరణ యాత్రను విజయవంతం చేయాలని శనివారం కొత్తగూడెం నగర అధ్యక్షుడు వందనపు శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు భజరంగ్‌దళ్ శౌర్య జాగరణ యాత్ర సూపర్‌బజార్ రైల్వే స్టేషన్ నుంచి లక్ష్మీదేవిపల్లి వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు, హిందూత్వ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బకాయిలు చెల్లించండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇల్లెందు: మున్సిపల్ కార్మికులకు పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కమిషనర్ నవీన్‌కు మున్సిపల్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. శనివారం తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ నేతృత్వంలో కార్మికులు తమకు సీఎం కేసీఆర్ ప్రకటించిన పీఆర్‌సీ బకాయిలు సుమారు రూ.51 వేలు 97 మందికి పెండింగ్‌లో ఉందని తెలిపారు. కార్యక్రమంలో కుమార్, మహేష్, సంజీవ్, బాలాజీ, నందు, సంపత్, ఎల్లబాయి, ఉమా, వరలక్ష్మి, అనిల్ తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి తన స్కూటీపై వెళ్తున్న ఆ పంచాయతీ కార్యదర్శి షర్మిలాబేగంను ఓ కారు ఢీ కొట్టిన ఘటనపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఎస్‌ఐ అప్పారావు తెలిపిన వివరాలు.. 27న గ్రామపంచాయతీ నుంచి ఇల్లెందుకు వస్తున్న కార్యదర్శి షర్మిలాబేగంను ఓ కారు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తండ్రి మాలే జాన్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ నాగరాజు మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.

సింగరేణి ఉద్యోగి మృతి

సింగరేణి(కొత్తగూడెం): ఏరియాలోని ఏరియా స్టోర్స్‌లో సూపరింటెండెంట్ గుండా రాయలింగు (60) శుక్రవారం అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలిసిన ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ శనివారం రామవరంలోని రాయలింగు స్వగృహంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పాఠశాలలో 'ఉపాహారం' పరిశీలన



అల్పాహారం వడ్డిస్తున్న డీఈఓ వెంకటేశ్వరచారి

ఇల్లెందు: విద్యార్థులకు అందిస్తున్న ఉపాహారం తీరును జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి పరిశీలించారు. శనివారం ఇల్లెందు పట్టణంలోని స్టేషన్ బస్తీ ఉర్దూ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా నిర్ణయించిన పాఠశాలల్లో నిర్ణీత మెనూ ప్రకారం అమలు చేయనున్నట్లు తెలిపారు. 1 నుంచి 10 తరగతుల వారికి ఉపయోగంగా ఉంటుందన్నారు. ఎంతోమంది పేదవిద్యార్థులు ఉదయం ఇంట్లో టిఫిన్ తినకుండా పాఠశాలకు వస్తుంటారని, అలాంటి వారికి ఈ ఉపాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం యాదమ్మ, మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ, ఈశ్వర్, హెచ్‌ఎం అతియా ముంతాజ్ తదితరులు ఉన్నారు.

పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

జూలూరుపాడు: తెలంగాణ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఇటీవల విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ తుది ఫలితాల్లో జూలూరుపాడు మండలానికి చెందిన 18 మంది యువతీ, యువకులు పోలీస్ ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. పాపకొల్లు ఒకే గ్రామం నుంచి ఏడుగురు యువతీ, యువకులు పోలీస్ ఉద్యోగానికి ఎంపిక కావడం విశేషం. పాపకొల్లు గ్రామానికి చెందిన ముత్యాల సంధ్యారాణి (సివిల్), రాయి కృష్ణవేణి (ఎక్సైజ్) ఎంపికయ్యారు. బానోత్ హన్మంతు (బెటాలియన్), బానోత్ సంతోష్ (బెటాలియన్), భూక్యా రమేష్ (బెటాలియన్), కుమ్మరికుంట్ల ప్రశాంత్ (బెటాలియన్), రాజావుపేటకు చెందిన దొప్పా జగదీష్ కుమార్ (బెటాలియన్)కు ఎంపికయ్యారు. కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బానోత్ రవికుమార్ (సివిల్), వినోభానగర్‌కు చెందిన భూక్యా సంధ్య (సివిల్), చిలుకూరి గోపి (సివిల్) ఎంపికయ్యారు. జూలూరుపాడుకు చెందిన మోదుగు కిరణ్ (ఎక్సైజ్), పప్పుల వంశీ (ఏఆర్) ఎంపికయ్యారు. వెంగన్నపాలెంకు చెందిన సాయిల నిశాంత్ (అగ్నిమాపక) ఎంపికయ్యాడు. మాచినేనిపేటకు చెందిన మల్లెల ఉపేందర్ (బెటాలియన్), బానోత్ కోటేశ్వరరావు(బెటాలియన్) ఎంపికయ్యారు.

సుజాతనగర్: జామ్లాతండా గ్రామ యువకులు ముగ్గురు కానిస్టేబుల్ ఉద్యోగాలను అందిపుచ్చుకున్నారు. గ్రామంలోని లకావత్ శివ (బెటాలియన్), అంగోత్ సుప్రియ (ఏఆర్), అజ్మీరా సంతోష్ (బెటాలియన్)లో ఉద్యోగాలు సంపాదించారు.

గుడిసెల్లో ఉంటున్నాం.. గృహలక్ష్మి ఇవ్వండి


గుడిసెలో ఉంటున్నామని ఫొటోలు చూపిస్తున్న మహిళలు

సుజాతనగర్: గుడిసెలలో నివాసం ఉంటున్న తమను గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేయకపోవడం తగదని అంబేద్కర్ నగర్‌కు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పథకంలో తమకు చోటు కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. నిరుపేద దళితులమైన తాము సుమారు 120 మంది ఎన్నోఏళ్లుగా గుడిసెలలో ఉంటున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా తమ స్థితిగతులను తెలుసుకుని గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

కార్యక్రమంలో మహిళలు కుక్కముడి లక్ష్మి, మంద మెర్సీ, కేసుపాక రాజ్యలక్ష్మి, కవులూరి అరుణ, దంసలపూడి ఉమ, వేల్పుల కృష్ణవేణి, గుర్రం కోటేశ్వరి, కేసుపాక లక్ష్మి, వేల్పుల రేణుక, కుక్కమూడి అంజమ్మ, మంద వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల బిక్షాటన


ఇల్లెందురూరల్: కొమరారంలో బిక్షాటన చేస్తున్న ఆశా కార్యకర్తలు

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆశా వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకుంది. వివిధ రూపాల్లో తమ ఆవేదనను తెలియజేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడాన్ని నిరసిస్తూ మండలంలోని కొమరారం గ్రామంలో ఆశా కార్యకర్తలు శనివారం బిక్షాటన చేశారు. పలు దుకాణ సముదాయాలతోపాటు ప్రతి ఇంటికీ వెళ్లి తమ సమస్యలను వివరిస్తూ బిక్షాటన చేశారు. కార్యక్రమంలో చుంచు విజయ, కోరం దేవకి, గుగులోత్ కౌసల్య, గుగులోత్ భారతి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: పారితోషకాలు వద్దు.. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 13వ రోజుకు చేరింది. సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ సమ్మె శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. సమ్మెను అడ్డుకునేందుకు అధికారులు, ప్రభుత్వం కుట్రలు చేస్తున్నారని, భయపడేది లేదని, సమస్యలు పరిష్కారం కాకుండా వెనక్కి తగ్గేది లేదన్నారు. గ్రామాల్లో ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి శకుంతల, మజహరి, చైతన్య, నిర్మల, లక్ష్మి పాల్గొన్నారు.

మహిళలు 552 మంది.. బతుకమ్మ చీరలు 131 !

పాల్వంచరూరల్: రేషన్ కార్డులు ఎక్కువ, వచ్చిన బతుకమ్మ చీరలు తక్కువగా ఉండటంతో ఎవరికి ఇవ్వాలి..? అని బంద్రుగొండ సర్పంచ్ పద్మ దంతలబోరు ఎస్సీకాలనీ సర్పంచ్ గద్దల రమేష్, ఎన్‌డీ నాయకులు రాంబాబు శనివారం డీటీ వినయ శీలాశ్రీరాంను కలిసి సమస్యలు వివరించారు. దంతలబోరు గ్రామపంచాయతీలోని రేషన్‌షాపులో మొత్తం 456 రేషన్ కార్డులు ఉండగా.. మహిళలు 552 మంది ఉన్నట్లు చెప్పారు. కానీ ప్రభుత్వం నుంచి వచ్చిన బతుకమ్మ చీరలు కేవలం 131 మాత్రమే రెవెన్యూ అధికారులు పంపించినట్లు తెలిపారు. స్పందించిన డీటీ పైనుంచి కొంత మేరకే వచ్చాయని, రెండో విడత వచ్చినప్పుడు మిగిలినవి పంపిస్తామని చెప్పారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

సుజాతనగర్: సుజాతనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో కలిసి శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమం సందర్భంగా స్టేజీపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సుజాతనగర్ సర్పంచ్ సీకా కృష్ణవేణి ఫొటో లేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేజీపైకి ఎక్కేందుకు నిరాకరించారు. కొంతసేపు స్టేజీ వద్ద నేలపై కూర్చున్న ఆమె తాను దళిత మహిళ అని అవమానిస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు నచ్చజెప్పిన నాయకులు ఆమెను స్టేజీపైకి పిలిచి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు.

మాట్లాడుతూ.. ప్రొటోకాల్ ప్రకారం తనను పిలవాల్సి ఉండగా ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఇది పార్టీ కార్యక్రమం అంటూ నాయకులు బదులిచ్చారు. అయితే కలెక్టర్ ఫొటో ఎలా పెట్టారంటూ.. అక్కడి నుంచి ఆమె వెళ్లిపోయారు.

రీజియన్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం


ఇల్లెందు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం జాన్‌ఆనంద్


సింగరేణి(కొత్తగూడెం): క్రీడాకారులతో అధికారులు

ఇల్లెందు: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇల్లెందు ఏరియా రీజినల్ స్థాయి లాన్ టెన్నిస్, బాస్కెట్ బాల్ క్రీడా పోటీలను ఏరియా జీఎం జాన్ ఆనంద్ శనివారం సీఓఏ క్లబ్, సింగరేణి గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ పోటీలలో ఇల్లెందు, మణుగూరు ఏరియా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ సాయి స్వరూప్, జాన్ వెస్లీ, బాలాజీ, క్రీడాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో శనివారం ఏరియా డబ్ల్యూపీఎస్ జీఎం ఆధ్వర్యంలో రీజినల్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, పర్సనల్ మేనేజర్ శివ కేశవరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎంఓఏఐ ప్రెసిడెంట్ పాలడుగు శ్రీనివాస్, సూపర్ వైజర్ పాసినెట్, సీనియర్ పీఓ మజ్జి మురళి, యూనియన్ ప్రతినిధులు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సాగర్ పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్ దుర్గాప్రసాద్ -79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148